ప్రజాశక్తి
మంగళవారం 29 ఆగస్టు 2023
5
విజయనగరం

నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 29 నుంచి గ్రామ పంచాఅతీ కార్యదర్శులకు ఆరు రోజుల రిఫ్రెషర్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సిఇఒ కె.రాజ్‌కుమార్ తెలిపారు. ఒక్కో బ్యాచ్‌కు 50 మంది చొప్పున విజయనగరం జిల్లాలోని 713 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలోని 401 మంది పంచాయతీ కార్యదర్శులకు ఐదు బ్యాచ్‌లుగా శిక్షణను పూర్తి చేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయనగరం జిల్లా పంచాయతీ కార్యదర్శులకు విటి అగ్రహారం టిటిడిసిలో, పార్వతీపురం కార్యదర్శులకు కణపాక యూత్ హాస్టల్‌లో శిక్షణ జరుగుతుందని వివరించారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ చట్టం, జిల్లా ఆఫీసు మాన్యువల్, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, లేఅవుట్ల అనుమతులు, సుస్థిరాభివృద్ధి, స్వామిత్వపై శిక్షణ ఉంటుందని తెలిపారు.

సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు తమ్మినేని, శంకర్రావు తదితరులు

ప్రజా సమస్యలపై

30 నుంచి సమరభేరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని, భారాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సమరభేరి నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా నిరసన కార్యక్రమం గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. గద్దెనెక్కిన మొదలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నులు భారాన్ని మోపుతోందన్నారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీ భజనచేస్తూ ఆ విధానాలనే అత్యుత్సాహంతో అమలు చేస్తున్నారని అన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా, దేశవ్యాపితంగా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, అధిక ధరలను అదుపు చేయాలని, సరసమైన ధరలకు నిత్యావసరాలు అందించాలని, విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని సిపిఎం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని తెలిపారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చి గద్దెనెక్కిన మోడీ ఆచరణలో సంవత్సరానికి కనీసం రెండు లక్షల ఉద్యోగాలు కూడా కల్పించలేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. జిల్లా లో పరిశ్రమలు మూత పడి కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మూసివేసిన పరిశ్రమలు తెరిపిస్తే వేలాది మంది ఉపాధి కలుగుతుందన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లా ప్రజలు వలసలు పోతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న ఈ భారాలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుంచి ప్రచారం, సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1 గ్రామ, వార్డు సచివాలయాల్లో వినతుల సమర్పణ, 3న నిరుద్యోగ వ్యతిరేక దినం, 4న మండల కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తమ్మినేని తెలిపారు. జిల్లా ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, ఎ.జగన్మోహన్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా 'జగనన్నకు చెబుదాం'

- పేరు మారినా మారని తీరు
- అమలు కాని కలెక్టర్ ఆదేశాలు
- అర్జీలను బుట్టదాఖలు చేస్తున్న అధికారులు
- కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించడం లేదంటున్న అర్జీదారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. కాళ్లు అరిగేలా తిరుగుతున్నా న్యాయం జరగడం లేదంటూ అర్జీదారులు, ఫిర్యాదు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పందన పేరును 'జగనన్నకు చెబుదాం' అంటూ చేసిన మార్పు పొయ్యిమీద నుంచి పెనం మీదకు వెళ్లినట్టుగానే ఉందని, ఇటువంటి మార్పుల వల్ల తమకు ఒరిగిందేమీ లేదని చెబుతున్నారు. దీంతో, ఫిర్యాదులపై సకాలంలో స్పందించి, పరిష్కారం చూపడంలోనూ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నట్టుగా కలెక్టర్ తరపున వస్తున్న ప్రకటనలు ఉత్తుత్తివేనని స్పష్టమౌతోంది. ఈ నేపథ్యంలో మచ్చుకు కొంతమంది బాధితుల ఆవేదన, ఆక్రోశం పరిశీలిస్తే....

వేపాడ మండలం బక్కునాయుడిపేట బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహం ప్రాంగణంలో దట్టమైన ముళ్లపొదలు, తుప్పలు, రాళ్లగుట్టలతో ఉండడం వల్ల నిత్యం విష సర్పాలు తారసపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఎలాంటి అపాయం జరుగుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వసతిగృహం సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తప్పులు డొంకలను తొలగించాలంటూ ఓ సామాజిక కార్యకర్త స్థానిక ప్రజలతో కలిసి జగనన్నకు చెబుదాంలో జులైలో ఒకసారి, ఆగస్టు మరోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తొలిసారి కలసినప్పుడు తక్షణం పరిష్కరిస్తామంటూ కలెక్టర్ నాగలక్ష్మి హామీ ఇచ్చారు. రెండోసారి మూడు రోజుల్లో పరిష్కారం చేయకపోతే, స్థానిక ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా పరిషత్ సిఇఒను ఆదేశించారు. ఇప్పటికీ అధికారులు ఆ స్కూలు వైపు కన్నెత్తి చూడలేదు. పైగా జులై 24న పనిచేసినట్టు ఎంపిడిఒ తప్పుడు నివేదిక కూడా ఇచ్చారు. ఈనేపథ్యంలో స్థానిక ప్రజల సహకారంతో ఆ సామాజిక కార్యకర్తే కొంత భాగంలో తుప్పలు, డొంకలను తొలగించారు. ఇదే విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేసేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లినప్పటికీ, వీడియో కాన్ఫెరెన్స్‌లో ఉండడంతో వెనుదిరిగారు. సంక్షేమ వసతిగృహంలో ప్రమాదకరంగానూ, ప్రాణాంతకంగా ఉన్న తుప్పలను తొలగించేందుకు రెండు నెలలు సమయం అవసరమా? అంటూ కొందరు... కలెక్టర్ ఆదేశించడం తప్ప, అమలు చేసేందుకు ప్రయత్నించడం లేదని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఉదాసీనతతో స్థానిక ప్రజలు తొలగించిన తుప్పలు, డొంకల పనికి బిల్లుపెట్టుకునేందుకు కూడా అధికారులు, రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానిక ప్రజానీకం విమర్శిస్తున్నారు. ఇదే మండలంలోని గుడివాడవాని చెరువులో జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన విషయమై జగనన్నకు చెబుదాంలో నేరుగా కలెక్టర్‌కు జులై 17న ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదు. దీంతో, బాధిత రైతులు హైకోర్టును ఆశ్రయించడంతో నిర్మాణాలు వెంటనే ఆపాలంటూ సాక్షాత్తు కలెక్టర్‌కే ఈనెల 22న ఉత్తర్వులు జారీచేసింది. దీంతో, కోర్టుకు ఉన్న శ్రద్ధ, కలెక్టర్‌కు, సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులకు లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూసపాటిరేగ మండలం కొప్పెర గ్రామానికి చెందిన పార్వతి సమీపంలోని బయోటెక్‌లో కంపెనీలో ఉద్యోగం చేసేవారు. లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఆర్‌పై పూసపాటిరేగ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో కంపెనీ యాజమాన్యం పార్వతిని ఉద్యోగం నుంచి తొలగించింది. ప్రస్తుతం ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో ఉంది. తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలంటూ కలెక్టర్ నాగలక్ష్మిని ఇప్పటి వరకు మూడు సార్లు కలిసినా ప్రయోజనం లేకపోయిందని పార్వతితో పాటు సిఐటియు నాయకులు ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తొలిసారిగా కలిసినప్పుడే కార్మికశాఖ అధికారులతో మాట్లాడి, ఉద్యోగం తప్పక ఇప్పిస్తామని చెప్పినప్పటికీ, ఇప్పుడు దాటవేస్తున్నారని ఐద్వా నాయకులు చెబుతున్నారు.

కలెక్టర్‌కు వినతినిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు (ఫైల్)

విజయనగరం పట్టణంలోని 1వ డివిజన్ అప్పయ్యప్ప నగర్‌లో సర్వే నెంబర్ 136 ప్రభుత్వానికి చెందిన గెడ్డ ఆక్రమించి, అనుమతులు లేకుండా కమర్షియల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు అధికారులే తేల్చారు. ఈ ప్లాంటువల్ల తమ ఇళ్లల్లోని బోర్లు ఇంకిపోతున్నాయంటూ పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సుమారు 120 కుటుంబాలు ఆందోళన చేస్తున్నాయి. వీరి సంతకాలతో కూడిన వినతిపత్రాలను జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో నేరుగా కలెక్టర్, జెసిలకు 9 సార్లు అందజేశారు. ఇందులో ఏడు సార్లు జగనన్నకు చెబుదాంలో రికార్డులో నమోదైంది. ఒకసారి జెసి, మరోసారి కలెక్టర్ వెంటనే సీజ్ చేయాలని కూడా విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములు నాయుడును ఆదేశించారు. అయినా అమలుకు నోచుకోలేదు. దీంతో, ఆ కాలనీకి చెందిన రవికుమార్‌తోపాటు పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరావు, స్థానిక ప్రజలు సోమవారం మరోసారి కలెక్టర్‌కు వచ్చారు. ఇలా ఒకరూ... ఇద్దరు కాదు... వ్యక్తిగత సమస్యలపై కొందరు, సామాజిక సమస్యలపై మరికొందరు కలెక్టరేట్ చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ఎన్నిసార్లు తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించడం లేదు సరికదా, సంతృప్తిగా వున్నారా? అన్న ప్రశ్నలతో ప్రభుత్వ సిబ్బంది తమ వద్దకు రావడం ఒకింత అసహనానికి గురిచేస్తోందని చెబుతున్నారు. కలెక్టర్ ఆదేశాలు అమలు చేయని అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పందనకు 146 వినతులు

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమానికి 146 వినతులు అందాయి. రెవిన్యూ శాఖకు సంబంధించి 110, ఎపిఇపిడిసిఎల్ కు 1, జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు 10, జిల్లా పంచాయతీ అధికారికి 9, మున్సిపల్ శాఖకు 12, డిఆర్‌డిఎకు 17, గ్రామవార్డు సచివాలయ శాఖకు 3 వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్(కె.ఆర్.ఆర్.సి) సూర్యనారాయణ, భూసేకరణ అధికారులు బి.సుదర్శన దొర, పద్మలత తదితరులు వినతుల స్వీకరించారు.

వివిధ వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వచ్చే వినతులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ జిల్లా అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల ద్వారా పరిష్కరించిన వినతుల్లో అర్జీదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమైన వినతులపై జాయింట్ కలెక్టర్ సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఆయా వినతులను పరిష్కరించి నట్టు సంబంధిత ప్రభుత్వ శాఖలు తెలియజేసినప్పటికీ అర్జీదారులు మాత్రం వాటి పరిష్కారం పట్ల అసంతృప్తి వ్యక్తం చేయడానికి గల కారణాలపై ఆరా తీశారు.

సమస్యలు వింటున్న జెసి మయూర్ అశోక్

43,900 మందికి విద్యాదీవెన

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని 43,900 మంది విద్యార్థులకు విద్యాదీవెన పథకం కింద రూ.29,44,44,873 విడుదలైంది. చిత్తూరు జిల్లా నగరిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో, ఈ మొత్తాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి, విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించిన అనంతరం, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి విద్యాదీవెన చెక్కును విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమాధికారి బి.రామానందం, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎం.యశోధనరావు, గిరిజన సంక్షేమాధికారి టి.చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో విద్యాదీవెన పథకం కింద ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ త్రైమాసికానికి సంబంధించి, 35,635 మంది బిసి విద్యార్థులు, 4,033 మంది ఎస్‌సి, 2,391 మంది ఇబిసి, 900 మంది కాపు, 655 మంది ఎస్‌టి, 248 మంది ముస్లిం, 38 మంది క్రిష్టియన్ విద్యార్థులకు మొత్తం రూ.29.44 కోట్లు జమ చేశారు.

గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లలిత ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి నల్లబోయిన లలిత (54) సోమవారం తెల్లవారు జామున తమ నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. నిద్రలో ఉండగా గుండెపోటు వచ్చిన ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు హుటా హుటిన తిరుమల-మెడికవర్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆదివారం ఇంట్లో సత్యనారాయణ వ్రతంతో పాటు మనుమడికి పేరు పెట్టే కార్యక్రమం నిర్వహించారు. రోజంతా సందడిగా గడిపిన ఆమె అంతలోనే కన్నుమూయడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఆమెకు భర్త విజయ్ కుమార్, కుమారుడు అఖిల్, కుమార్తె భావన ఉన్నారు. లలిత అనంతపురం జిల్లా నుంచి బదిలీపై 2019 నవంబర్ 3న విజయనగరం జిల్లా గ్రంథాయానికి కార్యదర్శిగా వచ్చారు. రెండేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. మంచి ఉద్యోగిగా పేరు తెచ్చుకున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం కర్నూలు జిల్లా గుత్తి మండలం పెరవలి గ్రామానికి తరలించారు. ఆమె మృతికి గ్రంథాలయ ఉద్యోగులు సంఘం అధ్యక్షులు రామభద్రరాజు, సిబ్బంది నివాళులర్పించారు.

అధికారుల నివాళి

గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎన్.లలిత మృతికి జిల్లా అధికారులు సంతాపం తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ అనంతరం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తో పాటు జిల్లా అధికారులు లలిత మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిముషాలు పాటించారు. విధుల పట్ల ఎంతో బాధ్యతగా వుంటూ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో మంచి సంబంధాలు గల ఒక సన్నిహిత అధికారిని కోల్పోయామని పలువురు పేర్కొన్నారు.

పల్లె ముంగిటకే ప్రభుత్వ సేవలు

ఆర్‌బికె, వెల్నెస్ సెంటర్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్, జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని నమ్మిన ముఖ్యమంత్రి జగన్... ఆ దిశగానే సచివాలయం వ్యవస్థను అమలు చేసి, ప్రజల వద్దకే అన్ని రకాల ప్రభుత్వ సేవలనూ తీసుకొచ్చారని ఎపి శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని కోరుకొండ గ్రామంలో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ (వెల్నెస్ సెంటర్)లను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యఅతిథి జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గ్రామ స్వరాజ్యం సాధన దిశగా సచివాలయ వ్యవస్థతో పాటు వివిధ రకాల ప్రభుత్వ సేవలను ముఖ్యమంత్రి జగన్ తీసుకువచ్చారని చెప్పారు. అన్ని సేవలూ సచివాయల్లోనే లభిస్తున్నాయన్నారు. కోరుకొండ, కోరుకొండపాలెం గ్రామాల్లో 1,426 గడపలుంటే.. ఈ నాలుగేళ్ల నాలుగు నెలల కాలంలో సుమారు రూ.18.50 కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయని వివరించారు. స్థానికంగా యువత కోసం వ్యాయామశాలకు అవసరమైన పరికరాలను జిల్లా పరిషత్తు నిధుల నుంచి సమకూరుస్తామని హామీ ఇచ్చారు. గత టిడిపి ప్రభుత్వం మాదిరి ఎన్నికల రాజకీయాలు చేయలేమని స్పష్టం చేశారు. కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఈ గ్రామ అభివృద్ధి తన బాధ్యతన్నారు. గత ప్రభుత్వం మాదిరి పథకానికో రేటు పెట్టే పరిస్థితి ఇప్పుడు లేదని, నాలుగేళ్ల కాలంలో అవినీతిరహిత పాలన అందించామని చెప్పారు. గ్రామస్థుల కోరిక మేరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని, లైన్‌మెన్‌ను నియమిస్తామని, ఇతర పెండింగు పనులనూ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, ఎఎంసి మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాథ్, సర్పంచ్ మైలపల్లి శంకరరావు, మాజీ సర్పంచ్ లగుడు శివాజీ, ఎంపిడిఒ జి.వెంకటరావు, వ్యవసాయ శాఖ ఎఒ ఉమామహేశ్వరరావు, రాకోడు పిహెచ్‌సి వైద్యాధికారి జగదీష్, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆర్‌బికెను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్, డిప్యూటీ స్పీకర్

నగరంలో రీసర్వే ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో జగనన్న శాశ్వత భుహక్కు, భూ రక్షణ అమలు ప్రక్రియలో భాగంగా రీ సర్వే ప్రారంభమైంది. సోమవారం 14వ డివిజన్ 17 వ నెంబర్ సచివాలయ పరిధిలో రీ సర్వే కార్యక్రమానికి మేయర్ విజయలక్ష్మి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా చేపడుతున్న రీ సర్వే ప్రక్రియ పట్ల ప్రజలు అపోహలు వీడి అధికారులకు సహకరించాలని కోరారు. భవిష్యత్తులో ఎటువంటి భూ తగాదాలు, ఇబ్బందులు లేకుండా సంపూర్ణ హక్కులతో ఆన్‌లైన్ విధానంలో అనుసంధానం చేసి ఆస్తిదారులకు భూహక్కు పత్రాలను అందించడమే ఈ పథకం ఉద్దేశమని అన్నారు. కమిషనర్ ఆర్. శ్రీ రాములనాయుడు మాట్లాడుతూ 52 చదరపు కిలోమీటర్లు మేర నగర పరిధి వ్యాపించి ఉందన్నారు. రీ సర్వే వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, భూ యజమానులు పూర్తిగా సహకరించి తమ వద్దకు వచ్చే సిబ్బందికి ఆస్తి వివరాలను అందించాలని చెప్పారు. ప్రజల వద్దకు వచ్చే సిబ్బందికి ఆస్తి వివరాలను అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎసిపి అమ్మాజీ, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, కార్పొరేటర్లు మారోజు శ్రీనివాసరావు, దాసరి సత్యవతి, కనకాల నాగవల్లి, మీసాల రమాదేవి అమ్మాజీ రావు, సర్వేయర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



నోటీసు అందజేస్తున్న మేయర్

రేషన్ కార్డులు పంపిణీ చేసిన మేయర్ విజయలక్ష్మి

14వ డివిజన్ పరిధిలో నూతనంగా మంజూరైన తెల్ల రేషన్ కార్డులను మేయర్ విజయలక్ష్మి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ అర్హత ఉండి తెల్ల రేషన్ కార్డు పొందలేని వారి వివరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి వారికి మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు.

తాటిపూడి నీటిని అమ్ముకుంటున్న జివిఎంసి

ధర్నాలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విశాఖ ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాటిపూడి జలాశయం నుంచి తీసుకెళుతున్న నీటిని జివిఎంసి అమ్ముకుంటోందని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని కృష్ణాపురం సమీపాన తాటిపూడి నీటి శుద్ధి కేంద్రం వద్ద తాటిపూడి ఆయకట్టు రైతు సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ 50ఏళ్ల నుంచి తాటిపూడి జలాశయం నుంచి విశాఖ జివిఎంసి ప్రజల దాహార్తి తీర్చేందుకు పైపులైన్ ద్వారా తాటిపూడి నీటిని విశాఖకు తరలిస్తున్నారని అన్నారు. ఈ నీటిని ప్రజల దాహార్తి తీర్చేందుకే కాకుండా వాణిజ్యపరంగా పరిశ్రమలకు అమ్ముకుని జివిఎంసి ఏడాదికి రూ.26.20కోట్ల ఆదాయాన్ని సమకూర్చు కుంటుందని తెలిపారు. తాటిపూడి నుంచి శృంగవరపుకోట మండలం కొత్తూరు వరకు జివిఎంసి రోడ్డు వెంబడి పైపు లైన్ వేశారని, ఈరోడ్డు 20 ఏళ్లగా పాడై పోవటంతో పాఠశాలకువెళ్లే వారికి, వాహనదారుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జివిఎంసి పరిధిలోనే ఈ రహదారి ఉన్నందున ప్రజల ఇబ్బందులను గమనించి వందల కోట్లు అర్జిస్తున్న దాంట్లో కనీసం లక్షల్లో ఖర్చు చేసైనా పాడైన రోడ్లను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సుమారు 20 ఆటోల్లో రైతులు నాయకులు విశాఖ జివిఎంసికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ, తాటిపూడి ఆయకట్టు రైతుల సంఘం కన్వీనర్ రాయవరపు సత్యనారాయణ, తాటిపూడి ఆయకట్టు రైతు సంఘం కో కన్వీనర్ లోకవరపు ఆదినారాయణ, తాటిపూడి ఆయకట్టు యూత్ అసోసియేషన్ వై.జోగి నాయుడు, తాటిపూడి ఆయకట్టు రైతుసంఘం నాయకులు సర్పంచ్ శ్రీరామ్మూర్తి, తాటిపూడి ఆయకటు సంఘం నాయకులు సూరి అప్పడు, వర్రీ సత్యారావు, సూరి దేవుడు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, పలు గ్రామాల ప్రజలు

విద్యార్థుల నమోదు వంద శాతం జరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

మిషన్ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో క్రింద వాలంటీర్ ద్వారా గుర్తించిన విద్యార్థుల నమోదు శత శాతం జరగాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఇప్పటి వరకు 97 శాతం పూర్తయిందని, మిగిలిన వారిని రెండు రోజుల్లోగా నమోదు పూర్తి చేయాలని సూచించారు. ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఎంఇఒలు, మండల ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం లో మంజూరు చేసిన పనులన్నీ వెంటనే ప్రారంభం కావాలని ఆదేశించారు. పూర్తయిన పనులకు బిల్లులను అప్లోడ్ చేయాలని తెలిపారు. ఉపాధి నిధులతో చేపడుతున్న భవన నిర్మాణాలు స్టేజ్ లు వేగంగా మారాలని ఆదేశించారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తదితరులు

విద్యుత్తు అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్తు అమర వీరుల స్ఫూర్తితో విద్యుత్‌ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని సిపిఎం నాయకులు ప్రతిన బూనారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా సిపిఎం, వామ పక్షాలు చేసిన పోరాటంలో బషీర్ బాగ్ వద్ద చంద్ర బాబు నాయుడు ప్రభుత్వం జరిపించిన కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి సంస్మరణ కార్యక్రమం సోమవారం ఎల్‌బిజి భవనంలో జరిగింది. అమరుల చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ నాటి పోరాట ఫలితంగా, కరెంట్ ఛార్జీలు నేటివరకు పెంచే సాహసం ఏ ప్రభుత్వమూ చేయలేదన్నారు. కానీ నేడు కేంద్రం అనుమతితో రాష్ట్రం ట్రూ అప్, సర్‌ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేస్తున్నారని అన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్య మిస్తామని తెఇపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, జగన్మోహన్, సిఐటియు నాయకులు యుఎస్ రవికుమార్, బి.రమణ పాల్గొన్నారు.

నేర నియంత్రణకు నాఖాబందీ

విజయనగరం :నేరాల నియంత్రణలో భాగంగా సోమవారం సాయంత్రం నగరంలో నాఖాబందీ చేపట్టినట్లు డిఎస్‌పి ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ తనిఖీల్లో వాహన పత్రాలు సక్రమంగా లేని 23 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను సీజ్ చేశామన్నారు. మోటారు వాహన చట్టం నిబంధనలు అతిక్రమించిన 153 వాహనదారులకు ఈ చలనాలు విధించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపైన 5 కేసులు, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపైన 3 కేసులు నమోదు చేశామన్నారు.

జిల్లా స్థాయి కరాటే పోటీల్లో సత్తా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాస్థాయి కరాటే పోటీలలో విజయనగరం లోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ మేరకు కోచ్ కానూరు సంతోష్ కుమార్ తెలిపారు. డ్రాగన్ పవర్ పంచ్ కరాటే డూ-అసోసియేషన్ సుమన్ కప్ 2023 పోటీలు కొత్తవలస లో ఆదివారం జరిగాయి. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు పి .కుశ్వంత్, ఎస్ .గీతిక్ వర్మ కుమిటిలో బంగారు, కాటాలో కాంస్య పతకం సాధించారు. పి. హేమంత్ కుమిటీలో కాంస్య, కాటాలో బంగారు పతకం సాధించారు. ఎస్. కార్తీక్, బి యశ్వంత్ కుముటిలో వెండి, కాటాలో కాంస్య పతకాలు సాధించారు. జె.నవీన్ నంద కుమిటిలో వెండి, కాటాలో కాంస్య పథకం సాధించారు. ఆర్ వంశీవరుణ్ రెండు విభాగాల్లో కూడా వెండి పతకం సాధించగా బి.శివ శ్రీహర్ష, బి షణ్ముఖ శ్రీ కర్, ఎస్ జితేంద్ర లు రెండు విభాగాలలో కాంస్య పతకాలు సాధించారు. సత్య డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో కరాటే శిక్షణ పొందిన వీరిని కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపల్ సాయి దేవమణి, కెన్యూరియో కరాటే అసోసియేషన్ కోచ్ కె. సంతోష్ కుమార్, అధ్యక్షుడు సుమన్ అభినందించారు.

విజయనగరం: క్రీడాకారులను అభినందిస్తున్న సత్య డిగ్రీ కళాశాల ప్రతినిధులు

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

రామభద్రపురం: ఇటీవల బొబ్బిలిలో నిర్వహించిన 16వ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో స్థానిక గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్కూల్ కరస్పాండెంట్ మోహన్ తెలిపిన వివరాల మేరకు జూనియర్, సీనియర్ విభాగాలలో 5 బంగారు, ఒక రజత 8 కాంస్య పతకాలుతో పాటు ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో జిల్లా స్థాయిలో రెండో స్థానం సాధించారన్నారు. వీరిని స్కూల్ చైర్మన్ పి.వెంకట రమణ, ప్రిన్సిపాల్ సంధ్య, కరస్పాండెంట్ మోహన్, కోఆర్డినేటర్ రామకృష్ణ, కోచ్ సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది అభినందించారు. తమ స్కూల్ విద్యార్థులు చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో విశేష ప్రతిభ చూపుతున్నారని ఇది తమకెంతో గర్వకారణమని అన్నారు.

క్రీడలపై ఆసక్తి కనబరచాలి

బొబ్బిలి: విద్యార్థులు, యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. శ్రీకళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన తైక్వాండో పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు పట్ల విద్యార్థులు, యువత ఆసక్తి కనబరచాలన్నారు. తైక్వాండో క్రీడతో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తైక్వాండోతో ఆత్మరక్షణ పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో సెట్విజ్ సిఇఒ రామ్ గోపాల్, కోచ్ బంకురు ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కరాటేలో కాంస్య పతకం

కొత్తవలస: స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థి కె. లక్ష్మీ దీపక్ జూనియర్ తైక్వాండో కరాటాలో కాంస్య పతకం సాధించాడని కళాశాల కరస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదిన వైజాగ్‌లో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే ఛాంపియన్ షిప్ 2023 పోటీల్లో పాల్గొన్నా లక్ష్మీ దీపక్ ఈ మెడల్ సాదించాడని తెలిపారు. మెడల్ సాధించిన దీపక్‌ను కళాశాల యాజమాన్యం కె. మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్ఇ కుమారబాబు అభినందించారు.

పౌష్టికాహారాన్ని అందించాలి

తెర్లాం: లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఉషారాణి అన్నారు. పెరుమాలి సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హత ఉన్న గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. అనంతరం రికార్డులను, నెలవారీ ప్రోగ్రెస్ రిపోర్టు తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ప్రతి సెంటర్ లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సెక్టార్ మీటింగ్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందనకు వినతుల వెల్లువ

తెర్లాం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతులు వెల్లువలా వచ్చాయి. తెర్లాం గ్రామానికి చెందిన సంతపురిటి కొండలరావు పొలంలో గల రాతి కోరికను సంబంధించిన పంపు షెడ్డుకు కొంతకాలంగా విద్యుత్ సరఫరా రావడం లేదని వినతినిచ్చారు. డి. గదబవలస గ్రామానికి చెందిన జె. అప్పలస్వామి వెలగవలస రెవెన్యూలో గల సర్వే నెంబరు 89/144 లో ఉన్న తమ భూమి రీ సర్వేలో జాయింటుగా కాకుండా గయ్యాళిగా నమోదైందని దీన్ని ఆన్‌లైన్‌లో సరిచేయాలని వినతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నిరసన

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ పంచాయతీ పరిధి బొడ్డవలస నాగావళి నది నుంచి అధికార పార్టీ నాయకులు కను సన్నల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని నిరసిస్తూ టిడిపి మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గం ఇంఛార్జి కొండ్రు మురళీమోహన్, టిడిపి నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. ముందుగా డంపింగ్ చేసిన ఇసుక వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు ఇసుక దందా పై పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం రోజునే తెలుగుదేశం పార్టీ అమలు చేసిన ఉచిత ఇసుక విధానాన్ని రద్దుచేయడంతో 40లక్షల కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. భవన నిర్మాణ కార్మికులు కుటుంబ పోషణ భారమై 130 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. ఇసుక మాఫియా మోసాలను, ఇసుక దోపిడీని ప్రశ్నించినందుకు ఎందరో బలయ్యారన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో రూ.40 వేలకోట్ల ఇసుక దోపిడీ జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దూబరరాధ్యాం, కర్నేన మహేష్, పాలూరు రామినాయుడు, గేదెల రామినాయుడు, గేదెల బాలమురళీ, మంతిన ఉషారాణి, మజ్జి శ్రీను, నారు జనార్దన, రమణ, రామినాయుడు, వల్ల భుజంగం, ఎస్ గోవిందరావు, ఎస్ సన్ని బాబు, లింగాల వలస సునీల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో 'నా మట్టి.. నాదేశం'

డెంకాడ: దేశ కోసం ప్రాణాలను అర్పించిన ధైర్యవంతులకు నివాళ్ళర్పించేందుకు, భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఎంవిజిఆర్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ 'మేరీ మట్టి మేరా దేశ్ మిట్టి కో నమన్, వీరోన్ కా వందన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామంలో తాగునీటి బోరును సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు ఆధ్వర్యంలో సోమవారం మరమ్మతు పనులు చేపట్టారు. జిల్లేడ తాగునీటి బోరు మరమ్మతులకు గురికావడంతో సర్పంచ్ చొరవ తీసుకొని గ్రామపంచాయతీ 15 ఆర్థిక సంఘం నిధులతో మెటీరియల్ తెప్పించి మరమ్మతు పనులు చేపట్టారు. తాగునీటి సమస్య ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యల్లో భాగంగా మరమ్మత్తులు చేపట్టారు. జల జీవన్ పథకంతో ఇంటింటి కుళాయిలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

31న సంఘీభావ పాదయాత్ర

కొత్తవలస: నారా లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులకు చేరుకుంటున్న నేపథ్యంలో ఈ నెల 31న సంఘీభావ పాదయాత్ర చేయనున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. కొత్తవలసలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెం నుంచి కొత్తవలస ఎన్టీఆర్ విగ్రహం వరకు ఆ రోజు ఉదయం 9గంటలకు సంఘీభావ పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ పాదయాత్రలో నియోజకవర్గ పరిధిలో గల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

తెర్లాం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎంఆర్ అగ్రహారం సచివాలయ పరిధిలో రంగప్పవలస, తమ్మిరావలస గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మొదటిగా రంగవలస గ్రామ సర్పంచ్ ఎస్ రాంబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆ సోదరుడు వేణుగోపాలనాయుడుతో కలిసి గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. మరోసారి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ, ఎంఇఒ త్రినాథ రావు, వివిధ శాఖల అధికారులు, నాయకులు బాబ్జి రావు, రామారావు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు రైతుల చెంతకు చేరాలి

వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు రైతుల చెంతకు చేరే విధంగా సిబ్బంది కృషి చేయాలని ఎస్‌కోట ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ బి చంద్రశేఖరావు సూచించారు. సోమవారం వేపాడ పశు వైద్య కేంద్రంలో గోపాలమిత్రులు, ఎహెచ్ఎలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ విషయంలో సిబ్బంది ఇప్పటి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో మందులు సిద్ధంగా ఉన్నందున పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించి రైతుల నుండి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పశువైద్యాధికారి బి సింహాచలం నాయుడు, ఎహెచ్ఎలు, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

కోటిచెరువు గట్టుపై సోలార్ దీపాలు

బొబ్బిలి: ఆరోగ్య ప్రాంగణం కోటిచెరువు గట్టుపై బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం రోటరీ అంతర్జాతీయ జిల్లా 3020 గవర్నర్ రాఘురి సుబ్బారావు రిమోట్ నొక్కి సోలార్ దీపాలను ప్రారంభించారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే శంబంగి అప్పల నాయుడు భూమి పూజ చేసి సోలార్ పోల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సోలార్ దీపాల వల్ల వాకర్స్‌కి ప్రయోజనం కలుగుతుందన్నారు. రోటరీ గవర్నర్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సేవాకార్యక్రమాలను చేయడంలో బొబ్బిలి రోటరీ ముందుంటుందన్నారు. రోటరీ అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ రోటరీ క్లబ్ కార్యదర్శి తూముల కార్తిక్ సహకారం, కృషితో సోలార్ దీపాలను ఆరోగ్య ప్రాంగణంలో వేసామన్నారు. రూ.1.20 లక్షల వ్యయంతో 10 సోలార్ దీపాలను అమర్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్ర శేఖర్, శ్రీహరి, శ్రీనివాస రావు, బంగార్రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల ధర్నా

విజయనగరం కోట: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయ్ హమాలీలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అంతకుముందు ఆర్అండ్‌బి జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శంకర్రావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో 10 ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద సుమారు 300 మంది 35ఏళ్లగా పనిచేస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో గజపతినగరం పాయింట్ గోడౌన్ ద్వారా నిలువ చేసిన సరుకులను బట్వాడా చేయడం మూలంగా సుమారు 40 మంది హమాలీలకు పని లేకుండా పోయిందన్నారు. ఇదే పద్ధతి జిల్లావ్యాప్తంగా కొనసాగితే హమాలీల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎం.నరసింహులు, ఎఐటియుసి నాయకులు అప్పారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా

విజయనగరం టౌన్ : నగరంలోని బిసి బాలుర వసతి గృహంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.సౌమ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల పట్ల పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. నగరంలోని బాలుర బిసి 1, 2 వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కిటికీలు సరిగా లేకపోవడం వల్ల ఇతరుల హాస్టళ్లలోకి ప్రవేశిస్తున్నారని తెలిపారు. మార్కెట్లో పెరుగుతున్న సరుకుల ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతినిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పి.రమేష్, గర్ల్స్ కన్వీనర్ లావణ్య, ఉపాధ్యక్షులు వెంకటరమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పవన్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఈనెల 30 నుంచి నాలుగు రోజులు పాటు ఘనంగా నిర్వహిస్తామని ఆ పార్టీ నాయకులు గురాన అయ్యలు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న హెటల్ జిఎస్ఆర్ వద్ద జనసేన రాఖీల పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. 31న పలు వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయనున్నామన్నారు. 1వ తేదీన పర్యావరణ పరిరక్షణ కోసం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటుతామన్నారు. 2న జనసేనాని పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్బంగా సర్వమత ప్రార్ధనలు చేయడంతో పాటు ఉదయం కోట జంక్షన్ వద్ద అల్పాహారం పంపిణీ చేస్తామన్నారు. గాజులరేగ, కోట జంక్షన్, కంటోన్మెంట్ గెంజిపేట ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి మందుల పంపిణీ చేస్తామన్నారు. అదేరోజు మధ్యాహ్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సేవా కార్యక్రమాలతో పాటు పలు వార్డుల్లో బర్త్‌డే కేక్ కటింగ్, వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ జన్మదిన వేడుకల్లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

బొబ్బిలి: అన్నదానం చేస్తున్న బాబూ పాలూరి, తదితరులు

రోగులకు పండ్లు,రొట్టెలు పంపిణీ

గజపతినగరం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా 3వ రోజు గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రిలో నియోజకవర్గ నాయకులు మర్రాపు సురేష్ ఆధ్వర్యంలో రోగులకు పళ్ళు, రొట్టెలను పంపిణీ చేశారు. అనంతరం రోగులకు ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు సరిగ్గా లేక పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి మాటల్లో తెలుస్తుందని జనసేన ప్రభుత్వం వచ్చాక మంచి వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు డా.రవి కుమార్ మిడతాన, గజపతినగరం నాయకులు పండు, శ్రీను, మహేష్, చరణ్, శంకర్, చాలం, పీరు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలు సందర్భంగా సోమవారం బొబ్బిలిలో ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బాబు పాలూరు ఆధ్వర్యంలో కోట జంక్షన్ తాండ్రపాపారాయ బొమ్మ దగ్గర ఆంధ్ర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ ఆహార శిబిరం వద్ద భవన నిర్మాణ కార్మికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి జనసేన నాయకులు సంచనా గంగాధర్, లెంక రమేష్, పల్లెం రాజా, గేదెల శివ, నరేష్, శ్రీను, రేవలా కిరణ్, సత్య, సంతోష్, సతీష్, హేమంత్, పోలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెమోలు అధికార దుర్వినియోగమే

ప్రజాశక్తి - వేపాడ

దిగువ స్థాయి అధికారులకు ఎంపిడిఒ అన్యాయంగా మెమో ఇవ్వడం అధికార దుర్వినియోగమేనని సిఐటియు జిల్లా నాయకులు తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. జిల్లా అధికారులు ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా పంచాయతీ కార్యదర్శి గౌరీ, పిఆర్ జెఇ ఆలీ, ఇఒపిఆర్‌డి ఎస్ ప్రసాద్‌లకు ఎంపిడిఒ పట్నాయక్ మెమోలు ఇవ్వడం అధికార దుర్వినియోగం అవుతుందన్నారు. బక్కునాయుడుపేట వసతి గృహంలో దాతలు రూ.లక్ష వెచ్చించి డొంకలు, రాళ్లు, బండ్లు తొలగిస్తే వాటిని ఎంపిడిఒ ఆధ్వర్యంలో జరిగినట్లు నివేదిక పంపించడానికి సహకరించని దిగువ స్థాయి ఉద్యోగులకు మెమోలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఎంపిడిఒ బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తూ అధికార పార్టీ నాయకులకు తొత్తుగా వ్యవహరించడం చట్ట విరుద్ధమని ఈయనపై చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో న్యాయపోరాటం చేస్తామని సూర్యనారాయణ తెలిపారు.

అప్పారావుకు ప్రాణహాని

సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావుకు ప్రాణహాని ఉందని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు అన్నారు. బికె. నాయుడుపేట వద్ద గల బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహం ఆవరణలో చదువుతున్న విద్యార్థులకు విష కీటకాలు నుండి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు అప్పారావు ఫిర్యాదు చేయడంతో ఆయనపై ఎంపిడిఒ పట్నాయక్‌తో పాటు మరి కొంత మంది గుర్రుగా ఉన్నారన్నారు. ఇప్పటికే అప్పారావుకు బెదిరింపు ఫోన్లు వచ్చాయని, ఎంపిడిఒ పనిచేయ కుండానే చేసినట్లు నివేదిక ఇవ్వడంపై అప్పారావు పోరాటం చేయడం తప్పా అని ప్రశ్నించారు. మరోసారి అప్పారావుకు బెదిరింపు కాల్స్ వస్తే టిడిపి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతామని వెంకటరావు హెచ్చరించారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల వసతి గృహం, కస్తూరిబా బాలికల వసతి గృహం, ఎపి ఆదర్శ పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతలు, పండ్ల మొక్కలు, గ్రీన్‌ఫీల్డ్ పార్క్‌కు మహాత్మా జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేయించాలని సామాజిక కార్యకర్త అప్పారావు జిల్లా కలెక్టర్ స్పందన విభాగంలో సోమవారం కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ నాగలక్ష్మి కార్యకర్త అప్పారావు సమక్షంలోనే పరిశీలన జరిపి అవసరమైన నిధులను మంజూరు చేసి కార్యకర్త పర్యవేక్షణలో పనులు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఉపాధి హామీ పీడీకి ఆదేశాలు జారీ చేసినట్లు సామాజిక కార్యకర్త అప్పారావు తెలిపారు.

విద్యుత్తు అమర వీరులను స్మరించుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యుత్ పోరాట అమర వీరులను స్మరించుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు అన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద హమాలీ సంఘం ఆధ్వర్యంలో 2004 విద్యుత్ పోరాట అమర వీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అమర వీరుల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ 2004లో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ పోరాటం చేసి అమరులైన వీరులను స్మరించుకోవడం గర్వంగా ఉందన్నారు. వారు విద్యుత్ పోరాటంలో అమరులై 19 సంవత్సరాలు గడుస్తున్నా వారి త్యాగాన్ని మరువలేమన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు అధికంగా పెంచడం మరోసారి విద్యుత్ ఉద్యమానికి ప్రోత్సహించడమే నన్నారు. విద్యుత్ పోరాట అమర వీరుల త్యాగాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు అమలులో భాగంగా పెంచుతున్న విద్యుత్ ఛార్జీలకు నిరసనగా పోరాటాలు, ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణ రావు, కెళ్ళ గోవింద రావు, పతివాడ పెద రాంబాబు, చిన రాంబాబు, మీసాల లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మాట్లాడుతున్న కిల్లంపల్లి రామారావు

కొత్తవలస: విద్యుత్ ఉద్యమంలో అమరులైన ఉద్యమకారులకు కొత్తవలస సిపిఎం పార్టీ కార్యాలయం ఘనంగా నివాళులు అర్పించింది. అప్పటి టిడిపి గవర్నమెంట్ విద్యుత్ ఉద్యమ కారులపై నిర్ధక్షాన్యంగా కాల్పులు జర్పిందని సిపిఎం నాయకులు గాడి అప్పారావు అన్నారు. ఈ ఉద్యమంలో అసువులు బాసిన అమర వీరులకు జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమం మహేష్, రమణ, హర్ష, నాయుడు తదితరులు పాల్గొని నివాళ్లు అర్పించారు.

జీవామృతంతో రైతులకు మేలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వరి పండించే రైతుకి ద్రవ జీవామృతంతో ఎంతో మేలు జరుగుతుందని కాంపాక్ట్ బ్లాక్ జిల్లా అధికారి ఆనందరావు అన్నారు. సోమవారం టెక్కలిలో వరి పొలానికి ద్రవ జీవామృతం, జిల్లేడు ద్రావణం, వినియోగం పై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ద్రవ జీవామృతం, జిల్లేడు ద్రావణం వినియోగం వల్ల రైతులకు మేలు జరుగుతుం దన్నారు. రైతులు సంవత్సరం మొత్తం ఆదాయం వచ్చేలా గట్లు పై మునగ, అరటి, బొప్పాయి మొక్కలు వేసుకోవడం వల్ల అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. అనంతరం రైతులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

గరివిడి : ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయాధికారి డిపిఎం ఆనందరావు అన్నారు. మండలంలో గెడ్డపువలస, కొండలక్ష్మిపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ప్రతి రైతు లైన్ సోయింగ్, కాలిబాటలు వేయడం వల్ల వచ్చే లాభాలు గురించి వివరించారు. వరి నాటిన 10 నుంచి 15రోజుల మధ్యలో 200లీటర్ల ద్రవజీవామృతం చల్లాలని చెప్పారు. ఎల్‌వన్ నాగమణి, వివిఎ సూరిబాబు, గెడ్డపువలస ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్‌పై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- బాడంగి

యువగళం పాదయాత్రలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్ఐ జయంతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరిపై ఎక్కువ కేసులుంటే వారికే ప్రాధాన్యత ఇస్తామని చెప్పడం కచ్చితంగా వారిని రెచ్చగొట్టడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా విభాగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీ పరిధిలో 16వ వార్డు మెయిన్ మార్కెట్ రోడ్, గొల్లపల్లి 11వ వార్డుల్లో గత కొన్ని ఏళ్లుగా నిలిచిపోయిన ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు సోమవారం పరిశీలించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించారు. నాణ్యత లేనిచో తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణం జరిగిన 10 రోజులు వరకూ వాటరింగ్ చేయాలని చెప్పారు. పట్టణ పరిధిలో జరుగుతున్న పలు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో బొబ్బిలి ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతోందని స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేసిందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పలు రోడ్లు నిర్మాణాలు జగుతున్నాయని ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్స్ సవలపురపు రామకృష్ణ(బాబు), పాలవలస ఉమాశంకర్, ఇంటి గోవింద, కో ఆప్షన్ మెంబర్ తెర్లి సత్యారావు, వైసిపి నాయకులు దిబ్బ గోపాల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి కుమార్, కాంట్రాక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ అధికారుల జిల్లా పర్యటన

ఎస్.కోట, గంట్యాడలోని గ్రామాల్లో క్షేత్రస్థాయి అధ్యయనం

ప్రజాశక్తి-శృంగవరపుకోట, గంట్యాడ

జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు జరుగుతున్న తీరు, వారి జీవన విధానం, ప్రభుత్వ పథకాల ద్వారా వారు ఏవిధంగా ప్రయోజనం పొందుతున్నారనే అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం, పరిశోధన కోసం యువ సివిల్ సర్వీసుల అధికారుల బృందం చేపట్టిన జిల్లా పర్యటన సోమవారం నుంచి ప్రారంభమైంది. ముస్సోరిలోని బి.ఎస్.యుగంధర్ గ్రామీణ ప్రాంతాల అధ్యయన సంస్థలో శిక్షణ పొందుతున్న 14 మంది ఐఎఎస్ ట్రైనీలు జిల్లా పర్యటన కోసం ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. రెండు బృందాలుగా వారు విడిపోయి ఒక బృందం ఎస్.కోట మండలం పల్లపుదుంగాడ, మరో బృందం గంట్యాడ మండలం దిగువ కొండపర్తి గ్రామాల్లో సెప్టెంబరు 2వ తేదీ వరకు క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లోనే బస చేస్తూ గ్రామీణుల జీవనాన్ని పూర్తిస్థాయిలో అధ్యయనం చేయనున్నారు. ఎస్.కోట మండలంలో పర్యటిస్తున్న బందం సభ్యులు సోమవారం పల్లపుదుంగాడలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో మాట్లాడి ప్రభుత్వ పథకాల అమలు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. గ్రామస్థుల జీవనోపాధి కోసం డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. పాఠశాల ఉపాధ్యాయులతోనూ మాట్లాడి విద్యా పరిస్థితులను తెలుసుకున్నారు.

భూముల వివరాలు సేకరించండి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని డి-పట్టా భూముల వివరాలు సేకరించాలని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు విఆర్ఒలను ఆదేశించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.ఫోరం పట్టా భూముల వివరాలు సేకరించి ఆన్ లైన్ చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన హౌస్ టు హౌస్ వెరిఫికేషన్‌లో వచ్చిన చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబంధించిన ఫారంలను పూర్తిస్థాయిలో నింపి దానికి జత చేయవలసిన వివిధ డాక్యుమెంట్లను ఆయా అప్లికేంట్స్ ద్వారా తీసుకొని సమగ్రమైన ఫైల్ ని తయారు చేయాలన్నారు. దరఖాస్తు దారునికి తప్పనిసరిగా అప్లికేషన్ విషయమై తెలియజేయాలని ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకంలో భాగంగా రీ సర్వే జరగని గ్రామాల్లో ఫీల్డ్ పిఒఎల్ఆర్ పూర్తి చెయ్యాలని అన్నారు. సమావేశంలో డిటి గౌరి శంకర్‌రావు, రి సర్వే డిటి జి అప్పయ్య, రెవెన్యూ పరిశీలకులు కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

సకాలంలో నిత్యావసర సరుకులు అందజేయాలి

ప్రజలందరికీ నిత్యావసర సరుకులు సకాలంలో అందజేయాలని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు డీలర్లను, యండియు ఆపరేటర్లను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిత్యవసర సరుకులు సకాలంలో, సక్రమంగా నిర్దేశించిన ధరలకు మాత్రమే అందజేయాలని, ఎక్కడా ఎటువంటి అవినీతి ఆరోపణలకు చోటు లేకుండా నిత్యవసర సరుకుల పంపిణీ జరగాలని కోరారు.

బాబు ష్యూరిటీ ..భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి- నెల్లిమర్ల

చంద్రబాబు ష్యూరిటీతో భవిష్యత్తుకు గ్యారెంటీ దొరుకుతుందని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. ప్రజా వేదిక క్యాంపెయిన్‌లపై శిక్షణ కార్యక్రమాన్ని విజయనగరంలోని ఆనంద్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ సోమవారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం సెప్టెంబర్ 1వ తేదీన ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు ఎల్ఎల్ నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రావు, భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకర్రావు, పల్లె భాస్కరరావు, పతివాడ అప్పలనాయుడు, పతివాడ తమ్మినాయుడు, నగర పంచాయతీ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, కలిదిండి పాణిరాజు, రాష్ట్ర ఎస్సి సెల్ అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, దాంగ భూలోక, సామంతుల సొంబాబు, చిల్ల పద్మ, సుహాసిని పాల్గొన్నారు.

లోక్ అదాలత్ జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

సెప్టెంబర్ 9న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సమితి చైర్మన్ టి.వాసుదేవన్ కోరారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, బ్యాంకు తగాదాలు, ప్రీలిటిగేషన్, రాజీ కాబడిన క్రిమినల్ కేసులను రాజీ చేస్తామని చెప్పారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుక్కల దాడిలో దూడలు మృతి

ప్రజాశక్తి- వంగర

మండలంలోని ఎం సీతారాంపురంలో ఆదివారం అర్ధరాత్రి దాడి చేయడంతో రెండు ఆవు దూడలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బలగ జయరాం, మరో ఇద్దరు వ్యక్తులకు చెందిన ఈ దూడలు మృతి చెందినట్లు వారు చెబుతున్నారు. గ్రామంలో కుక్కలు గత వారం రోజుల నుంచి గుంపులు గుంపులుగా తిరిగి పాడి పశువులపై దాడి చేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలువలో పడి కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కెఆర్ పేట వద్ద గల రైవాడ కాలువలో ఆదివారం సాయంత్రం స్నానానికి దిగిన ఎఆర్ కానిస్టేబుల్ నక్కల ప్రదీప్ కుమార్ (35) మృతి చెందాడు. కాలువలో పడి నాచు మొక్కల్లో చిక్కుకొని చనిపోయినట్లు తెలిస్తోంది. కాలువ వైపు వెళ్లిన ప్రదీప్‌కుమార్ ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కాలువ వైపు వెళ్లి పరిశీలించగా చెప్పులు బట్టలు గుర్తించారు. మరికాస్త ముందుకెళ్లి చూడగా ప్రదీప్ మృతదేహం కాలువలో తేలి కనిపించింది. వెంటనే ఫిర్యాదు చేయడంతో వల్లంపూడి ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ఎస్‌కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విజయనగరము
MPHW(FEMEALE) ట్రైనింగు కోర్సుకు ప్రవేశ ప్రకటన

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపు పొందిన ఈ దిగున ప్రైవేటు ఎం.ఓఈ.హెచ్.డబ్ల్యు (female) ట్రైనింగు ఇనిస్టిట్యూట్‌లలో 2 years కాల పరిమితి గలిగిన ఎం.ఓ ఈ. హెచ్. డబ్ల్యు (female) ట్రైనింగు కోర్సు కొరకు 2023-24 సంవత్సరమునకు ప్రవేశానికి, అర్హులైన అభ్యర్థుల నునుండి దరఖాస్తు లను కోరడమైనది.

Sl. No	Name of the MPHW(F) Training Institute	Total Seats allotted	Convenor Quota 60%	Management Quota 10%	Tution fees for convener quota students per month	Tuition fees for management quota student per a month
1.	Sri Satya sai MPHW(Training institute	40	24	16	Rs.1000/-PM	Not exceeding 5times of the Convenor quota
2.	Venkata Padmavathi MPHW((F) Training Institute, S.Kota Vizianagaram	40	24	16	Rs.1000/-PM	Not exceeding 5times of the Convenor quota

విద్యార్హతలు : పై కోర్సునకు ఇంటరు మీడియట్ (any group) పరిక్ష లో ఉత్తీర్ణత.
వయోపరిమితి: పై కోర్సునకు 31-12-2023 నాటికి 17 సంవత్సరములు కనీస వయోపరిమితి మరియు 30 సం. లోపు వయస్సు కలవారై ఉండవలెను. ఎస్.సి. ఎస్.టి. బి.సి అభ్యర్థులకు గరిష్ట వయస్సు 5 సం. సడలింపు గలదు.
దరఖాస్తులు: దరఖాస్తు చేయుగోరు వారు దరఖాస్తు ఫారమును కమిషనర్ వారి వెబ్ సైట్ http//cfw.ap.nic.in. నందు పొంది పూర్తి చేసిన దరఖాస్తులను విజయనగరం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయమునకు తేది 08-08-2023 to 30-09-2023 వరకు సమర్పించవలసినదిగా తెలియజేయుచున్నాము.
ధరఖాస్తు రుసుము: రూ. 50/- (అక్షరాల యాభై రూపాయలు) Commissioner of Health and Family welfare A.P Amaravathi వారి పేరు మీద డి.డి తీసి దరఖాస్తుకు జత పరచ వలెను. ఎస్.సి. ఎస్.టి. బి.సి అభ్యర్థులకు ఫీజు మినహాయింపు కలదు. అవసరమైన అన్ని ధ్రువ పత్రాలతో పూర్తి చేసిన దరఖాస్తులు పంపవలసిన ఆఖరు తేది 30-09-2023 సాయంత్రము 5.00 లోపు విజయనగరము జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయమునకు స్వయముగా గాని పోస్టు ద్వారా గాని పంపవలెను. తపాలా శాఖ ఆలస్యమునకు ఈ కార్యాలయమునకు ఎట్టి భాద్యత లేదు. దరఖాస్తు ఫారం తో పాటు ఇంటరు మీడియట్ మార్కుల లిస్టు, కుల ధృవీకరణ పత్రము మరియు నివాసధ్రువ పత్రము లేక నాల్గవ తరగతి నుండి పడవ తరగతి వరకు గల స్టడీ సర్టిఫికేట్ ను జత చేయవలెను.
గమనిక: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఫీజు స్ట్రక్చర్ మారిన యెడల, అవి 'మీకు వర్తించును.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి
విజయనగరము